ప్రజాశక్తి
సోమవారం 15 జులై 2024 5 శ్రీ సత్యసాయి

ఇంటి పైకప్పు కూలి మృతిచెందిన దంపతులు మారెప్ప, లక్ష్మి

ఆ రాత్రి గడిచి ఉంటే...

ఇంటి పైకప్పుకూలి దంపతుల మృతి

ప్రజాశక్తి - ఉరవకొండ

ఆ ఒక్కరాత్రి గడిచి ఉంటే వారిద్దరూ బతికేవారు. తమ పాత ఇంట్లోపడుకున్న దంపతులకు అదే చివరి రాత్రి అయింది. తాము నివసిస్తున్న ఇల్లు శిథిలావస్థకు చేరుకోవటంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళనలో ఉన్న వారు తాము నిర్మించుకుంటున్న కొత్తఇంట్లో తాత్కాలికంగా ఉందామని నిర్ణయించుకున్నారు. మరుసటి రోజు ఆ ఇంట్లోకి సామాన్లు మారుద్దామని అనుకున్నారు. ఆ విషయంపై కుటుంబసభ్యులు శనివారం రాత్రి చర్చించుకున్నారు. అయితే ఆరాత్రి వారు పడుకున్న ఇంటి పైకప్పు కూలిపోయింది. దీంతో ఇంట్లో పడుకున్న ఆ దంపతుల్దిరి మీద మట్టిపెళ్లలు పడటంతో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఈ విషాదకర సంఘటన ఉరవకొండ మండలం హావళిగి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు...

ఉరవకొండ మండలం హావళిగి గ్రామానికి చెందిన మారెప్ప, లక్ష్మి అనే దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు. మారెప్ప స్థానికంగా ఉన్న ఓ రైస్‌మిల్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గ్రామంలో వారు నివాసమున్న ఇల్లు పాతది కావటంతో గ్రామంలోనే కొత్తగృహం నిర్మించుకుంటున్నారు. ఆ గృహానికి స్లాబ్ కూడా వేయించారు. శనివారం చిన్నపాటి వర్షం కురిసింది. తాము ఉంటున్న గృహం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అనుమానపడ్డారు. తెల్లవారితే కొత్తగా నిర్మించుకుంటున్న ఇంట్లోకి తాత్కాలికంగా చేరుదామని అనుకున్నారు. ఇదే విషయంపై ఇంట్లో చర్చించుకున్నారు. శనివారం రాత్రి మారెప్ప (49), లక్ష్మి (45) ఇంట్లో పడుకున్నారు. కూతురు మానస, బావమరది రాము కూడా ఇంట్లోనే పడుకున్నారు. మారెప్ప కుమారులు అంజి, హేమంత్ ఇంటిబయట పడుకున్నారు. అయితే అకస్మాత్తుగా ఇంటి పైకప్పు కూలిపోయింది. మారెప్ప, లక్ష్మిమీద పూర్తిగా మట్టిపెళ్లలు పడటంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. మానస, రాముకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారితో పాటు బయట పడుకున్న అంజి, హేమంత్ ప్రాణాలతో బయట పడ్డారు. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన మానస, రామును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆ ఒక్క రాత్రి గడిచి ఉంటే ఆ దంపతులు ఇద్దరూ బతికేవారని, ఇంతలోనే వారికి జరగరానిది జరిగిందని మృతుల బంధువులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దంపతులు ఇద్దరూ మృతిచెందడంతో మాటలు రాని యుక్తవయస్సులో ఉన్న మానస, అంజి, హేమంత్ అనాథలు అయ్యారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మృతుల కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

శనివారం రాత్రి మిద్దె పైకప్పు కూలి మృతి చెందిన దంపతుల కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబసభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులను పోగొట్టుకున్న ముగ్గురు పిల్లలు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ప్రభుత్వం ఖచ్చితంగా ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు.

యథేచ్ఛగా నకి'లీలలు'

- రైతులను నట్టేట ముంచుతున్న స్వార్థపరులు
- సోర్స్ సర్టిఫికెట్ లేకుండానే విత్తనాల అమ్మకాలు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ

దేశంలోనే కరువుకు నిలయం ఉమ్మడి అనంతపురం జిల్లా. జిల్లాలో వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతు ప్రకృతి కోపానికి బలవడం ఒకెత్తయితే.. రైతే లక్ష్యంగా మోసాలకు పాల్పడే అక్రమార్కుల చర్యలతో రైతులు పీకల్లోతు కష్టనష్టాల్లో కూరుకుపోతున్నారు. వర్షపాతం తక్కువ నమోదు అవుతున్న నేపథ్యంలో పడే కాస్తా వర్షంతోనే మొక్కజొన్న సాగు ఆశలో ఉండే రైతును సీజన్ ప్రారంభంలోనే నకిలీ విత్తనాలను, మరో పక్క సోర్స్ సర్టిఫికెట్ లేకుండానే దుకాణాదారులు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో రైతులు అప్పులు చేసి వేసిన పంటలు చేతికందక...చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఫర్టిలైజర్ దుకాణ నిర్వహకులు యధేచ్ఛగా నిబంధనలు అతిక్రమిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవటం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు ప్రధానంగా వర్షాధార పంటలపైనే ఆధారపడ్డారు. ఇందులో ముఖ్యంగా వేరుశనగ, మొక్కజొన్న, మిర్చి ఇతర పంటలతో పాటు బోరు బావుల కింద కొందమంది రైతులు ఉద్యానవన పంటలతో పాటు కూరగాయాల పంటలు పండిస్తూ జీవనం చేస్తున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న కొంత మంది ఫర్టిలైజర్ షాపు నిర్వహకులు ఒక పక్క నకిలీ విత్తనాలు, పురుగుల మందులను అధికధరలకు విక్రయిస్తున్నారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులు మార్కెట్‌లో రాజ్యమేలుతున్నా వీటి నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో అధికారులు పరిమిత చర్యలతోనే సరిపెడుతున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇందుకు నిదర్శనం హిందూపురం పట్టణంలోని నందిని సీడ్స్ దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు తనఖీ చేసిన సమయంలో దాదాపు అనుమతి లేకుండా విక్రయిస్తున్న రూ.23లక్షలు విలువ చేసే మొక్కజొన్న, వరి విత్తనాలు బయట పడడమే. దీంతో పాటు ఎరువులకు సంబంధించి రూ. 81వేలు విలువ చేసే హ్యూమిక్ యాసిడ్ 250 లీటర్లకు స్టాప్ సేల్స్ నోటీసును అధికారులు నిర్వాహకులకు ఇచ్చారు. ఒక్క దుకాణంలోనే ఇంత పెద్ద ఎత్తున అవినీతి బయట పడింది. ఇదే పట్టణంలో 11 ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 900 పైగా ఫర్టిలైజర్, విత్తనాల దుకాణాలు ఉన్నాయి. వీటిలో నిబంధనలకు లోబడి ఎన్ని దుకాణాలు నిర్వహిస్తున్నారో తెలియని స్థితి నెలకొంది. జిల్లాలో అడపదడపా విజిలెన్స్ అధికారులు తనఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అయితే ఎక్కడా కఠినచర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫర్టిలైజర్ దుకాణంలో ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎంఆర్‌పికే సేల్స్ చేయాలని లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్థానికంగా ఉన్న వ్యవసాయ అధికారులు హెచ్చరికలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినపడుతున్నారు. ఇక పోతే జిల్లాలో సాగు చేసే మరో ప్రధాన పంట మిర్చి. ఇందులో సైతం కల్తీ రాజ్యమేలుతోంది. దీంతో పంట చేతికందే సమయంలో పంటకు పురుగులు పడుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేస్తామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కల్పించడం లేదు. చివరికి అక్రమార్కుల ధనార్జనకు రైతులు బలవుతున్నారు.

ముంచుతున్న నకిలీ

జిల్లా మొత్తంగా బయో పురుగుల మందుల వ్యాపారం దాదాపు రూ.70 కోట్ల వరకూ ఉంటుందని అంచనా కాగా ఇందులో 90 శాతం మందులు నకిలీవని విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి జిల్లాలో దాదాపు 900 వరకు బయో పురుగు మందుల దుకాణాలున్నాయి. వీటిల్లో సీజన్‌కు రూ.30 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. ఇందులో 90 శాతానికి పైగా నకిలీ మందులే విక్రయిస్తారన్న ఆరోపణలున్నాయి. ఈ ఉత్పత్తులు పేరుతో చలామణీ అయ్యే కంపెనీల్లో వంద వరకుఉంటే అందులో నాలుగైదు కంపెనీలకు మించి అనుమతులు ఉండవు. అయినా అక్రమార్కులు ఆ మందులనే రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. విత్తన దుకాణాలు హిందూపురం పట్టణంలోని 11 వరకు ఉన్నాయి. వీటిల్లో సీజన్‌కు రూ.20 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. ఇందులో 20 శాతం అంటే రూ. 4 కోట్ల వరకూ నకిలీ విత్తన వ్యాపారమే ఉంటుందన్న ఆరోపణలు ఉన్నాయి. బయో కెమికల్ పేరుతో అనుమతి లేని నకిలీ ముందులను వ్యాపారులు చాటుమాటుగా అమ్ముతూ రైతులను నట్టేట ముంచుతున్నారు. ఉమ్మడి జిల్లాను నకిలీ బయో ఉత్పత్తులు ముంచుతున్నాయి. తెలంగాణతో పాటు పక్కన ఉన్నా కర్నాటక రాష్ట్రం నుండి వస్తున్న ఈ ఉత్పత్తులు వివిధ రకాల కంపెనీల పేరుతో జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. లైసెన్సు లేని వ్యాపారులు రైతులతో సంబంధాలున్న కొందర్ని ఎంపిక చేసుకుని లాభాల ఆశ చూపి వారి ద్వారా ఆయా మందులను రైతులకు అంటగడుతున్నారు. అమ్మకాలను బట్టి కమీషన్లతో పాటు బంగారం, వెండి నాణేలు ఇస్తూ అక్రమ వ్యాపారాన్ని మరింతగా విస్తరిస్తున్నారు. ఈ ఎరువుల ద్వారా తెగుళ్ళు, పురుగు నివారణతో పాటు పంటకు ఇతర పోషకాలు నేరుగా అందుతాయిని, పూత, దిగుబడి అధికంగా వస్తుందని నమ్మబలుకుతున్నారు. చిన్న మందు డబ్బా తయారీకి రూ.20 వరకు అవుతుండగా దాన్ని రూ. 600 వరకు అమ్మి అక్రమంగా అర్జిస్తున్నారు. రైతులను మోసం చేయడానికి ఉత్పత్తిదారులు తొలుత డీలర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ ఉత్పత్తులను ఎక్కువగా అమ్మిన వారికి అధిక కమీషన్లు, బంగారు నాణేలు ఇస్తామని ఆశ చూపుతున్నారు. వీటికి ఆశపడిన డీలర్లు.. తమకు రైతులతో ఉన్న పరిచయాలను ఉపయోగించి వారితో బయో ఉత్పత్తులను కొనిపిస్తున్నారు. అయితే రైతులకిచ్చే బిల్లులను అసలైనవి కాకుండా కోటేషన్ రూపంలో ఇస్తున్నారు. తీరా రైతు మోసపోయినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నాడు. విత్తనాల విషయంలో రైతులను మరో తరహాలో మోసం చేస్తున్నారు. కొన్ని కంపెనీలైతే ఒక సీజన్‌లో అమ్ముడవని విత్తనాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి వాటిని మరుసటి సీజన్‌లో కొత్త విత్తనాల ప్యాకెట్లతో కలిపి అమ్ముతున్నారు. అయితే వీటిపై పూర్తిస్థాయిలో నిఘా, కఠిన చర్యలు కరువయ్యాయి.

దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్ ఫొటో)

స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, కారును చూపుతున్న అధికారులు

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

వాహనం సీజ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

అక్రమంగా తరలిస్తున్న 13 ఎర్ర చందనం దుంగలను, వాహనాన్ని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. కదిరి రేంజ్ అటవీశాఖ అధికారి గుర్రప్ప ఆధ్వర్యంలో నల్లచెరువు మండలం పెద్ద ఎల్లం పల్లివద్ద కదిరి మదనపల్లి రహదారి పై వాహనాల తనిఖీ చేస్తుండగా మదనపల్లి నుండి కదిరి వైపు వస్తున్న వాహనంలో అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నట్లు గమనించారు. దీంతో అటవీశాఖ సిబ్బంది వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా వాహనాన్ని దూరంగా ఆపివేసి ఇద్దరు దుండుగులు పరారయ్యారు. దీంతో వాహనంలో ఉన్న 13 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 2 లక్షలపై చిలుకు ఉంటుందని కదిరి రేంజ్ అటవీశాఖ అధికారి గురప్ప తెలిపారు. వాహనం నెంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రామచంద్ర నాయక్, సెక్షన్ అధికారి రామచంద్రారెడ్డి, ఎఫ్‌బిఒలు నాగరాజు, హరిప్రసాద్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో లబ్ధిదారులకు టిడ్కో గృహాలు

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

నూతన సాంకేతికతో టిడ్కో గృహాలను పూర్తి చేయడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, మరో ఆరు నెలల్లో లబ్దిదారులకు అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. అదివారం పట్టణంలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఎంపీ పార్థ సారథితో కలిసి బాలకృష్ణ పాల్గొన్నారు. పట్టణ సమీపంలోని కోటిపి రోడ్డులో రూ. 3.50 కోట్లతో చేపట్టిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం గత టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిట్కో గృహాలను పరిశీలించారు. పట్టణంలోని పరిగి బస్టాండ్ సమీపంలో రూ. 44.60 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. నానెప్ప నగర్ కెవిఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో కైవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా టిడ్కో గృహాల వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హాయంలో ఇసుక, మద్యం అమ్మకాల్లో భారీ స్కాం చేశారని, సిఎంతో పాటు మంత్రులు వేల కోట్లరూపాయల అవినీతికి పాల్పడ్డరని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసిందన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలని సంకల్పించి అప్పటి టిడిపి ప్రభుత్వం టిడ్కో గృహాలను నిర్మించిందన్నారు. వాటిలో చిన్న చిన్న పనులు పూర్తి చేయాల్సి ఉంటే, వాటిని పూర్తి చేయకుండా వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. దీంతో ఆ గృహాలు పాడుబడి పోయాయన్నారు. ఇందులో ప్రథమంగా రూ. 3.50 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. దీని ద్వారా టిడ్కో గృహాలతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. హిందూపురం సమగ్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రితో ఇప్పటికే చర్చించామని, ప్రత్యేక నిధులు తీసుకు వచ్చి హిందూపురం పట్టణంతో పాటు నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. జిల్లా కేంద్రం మార్పుపై మీడియా అడిగిన ప్రశ్నకు చూస్తామంటూ దాటవేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ల్గొన్నారు. బాలకృష్ణ రాకతో భారీగా నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా **ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించండి**

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని, వైద్యులు అందరు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించి అసుపత్రికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే బాలకృష్ణ వైద్యులకు సూచించారు. అసుపత్రి అభివృద్ధిపై మెడికల్ సూపరింటెండెంట్ రోహిల్ కుమార్, ఆర్ఎంఒ రోహిల్ కుమార్, వైద్యులు ఆఫ్తాబ్, ఇతర వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసుపత్రిలో అవసరమైన సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతు త్వరలో సీటీ స్కాన్ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో హిందూపురం అసుపత్రిని మోడల్ గా తీసుకునే వారన్నారు. అయితే గత ప్రభుత్వం చేతగానితనం వల్ల అసుపత్రిలో సేవలు రోగులకు అందడం లేదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో చర్చించి అన్ని సౌకార్యలు కల్పిస్తామనిహామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జెవిఎస్ ఎడ్యూకేషన్ ట్రస్టు అధ్యక్షులు జేఈ వెంకట స్వామి అసుపత్రికి అందజేసిన అంబులెన్స్‌ను బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సమావేశంలో వైద్యులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన వినతులు

ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురానికి రావటంతో ప్రజలు పెద్ద ఎత్తున వినతులు ఇవ్వడానికి ఆయన నివాసం వద్దకు వచ్చారు. సిపిఐ నాయకులు భూ పోరాటంలో భాగంగా వేసిన గుడిసెలకు ఇంటి పట్టాలను ఇవ్వాలని వినతిని ఇచ్చారు. డిఎస్‌సిలో ఉర్దూ పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అభ్యర్థులు వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా వివిధ సంఘాల వారు, ప్రజలు సమస్యలపై బాలయ్య వినతులు ఇచ్చారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు

జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ మంజువాణి

డిఎం హెచ్ఒ మంజువాణి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు చేపడుతున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెలిబుచ్చారు. జిల్లావ్యాప్తంగా అతిసారా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యాధులు అదుపులో ఉన్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది, మండల అభివృద్ధి అధికారులు తగిన జాగ్రత్తలు పాటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రిలో ఉన్నాయి?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు ఏరియా ఆసుపత్రులు, 18 అర్బన్ హెల్త్ సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించడమే కాక గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో వైద్య సిబ్బందిచే అవగాహన కార్యక్రమాలు, సర్వేలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్ర : జిల్లావ్యాప్తంగా ఆసుపత్రులలో మందుల కొరత, సిబ్బంది కొరత ఉందా ?

జ : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా మందులు కొరత ప్రస్తుతం లేదు. గతంలో కొరత రావడంతో పక్కన ఉన్న జిల్లాల నుండి కొన్ని మందులను తెప్పించుకొని అన్ని కేంద్రాలకు అందజేశాం. ఇక సిబ్బంది కొరత ఎక్కడా లేదు. ఉన్న సిబ్బందితోనే అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సిబ్బంది కొరత ఏర్పడిన చోట ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ద్వారా ఖాలీలను పూరించే విధంగా చర్యలు చేపడతాం.

ప్ర : జిల్లాలో డయేరియా వ్యాప్తిపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

జ : జిల్లాలో ప్రస్తుతం డయేరియా కేసులు లేవు. డయేరియా ప్రబలకుండా తగిన చర్యలు తీసుకున్నాం. గత నెలలో 14వ తేదీ నుండి 30 వరకు గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించాం. అనంతరం జులై 1వ తేదీ నుండి 30 వరకు ప్రతి ఇంటికి వెళ్లి రెండు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసి ఆ వ్యాధి ఎలా సక్రమిస్తుంది దానిపై వారికి అవగాహన కల్పించి ఆ వ్యాధి లక్షణాలు, ఎలా ఉంటాయి, నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అంతే కాక జిల్లాలో గతంలో మలేరియా కేసులు ఉత్పన్నమైన 9 గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలలో ఐఆర్ఎస్ స్ప్రే పిచికారి చేసి దోమల వ్యాప్తిని అరికట్టే విధంగా చర్యలు తీసుకున్నాం.

ప్ర : ఖ్రీరిచ్చే వైద్య సలహాలు, సూచనలు

జ: ఆగస్టు ,సెప్టెంబర్, అక్టోబర్ మూడు మాసాల పాటు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కుటుంబంలో వ్యక్తిగత శుభ్రతను పాటించాలి. భోజనం ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. గ్రామాల్లో, నివాసాలు ముందు నీటి గుంతలు, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలి. దోమలు కుట్టకుండా అవి ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు చేపట్టాలి. దోమలనుండి రక్షణ కోసం దోమతెరలు, వేపాకు పొగ, ఇంటి కిటికీలకు మెస్సు వాడాలి. ఎక్కువ శాతం బయట ఆహార పదార్థాలు తినకుండా కుటుంబంలోనే తయారు చేసుకుని తినాలి. బయట లభించే జంక్ ఫుడ్ తీసుకోరాదు. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. వాంతులు విరేచనాలు సంభవిస్తే నాటు వైద్యం చేయించుకోకుండా తక్షణం ప్రభుత్వ ,ప్రైవేటు ఆసుపత్రులలో డాక్టరును సంప్రదించి సలహాలు సూచనలు పాటించాలి.

మడకశిరలో నేటి నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

మడకశిర : పట్టణంలోని ఎస్‌వైటిఆర్ డిగ్రీ కళాశాలలోని సమావేశ మందిరంలో ఈ నెల 15వ తేదీ (సోమవారం) నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభ మవుతాయని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, తహశీల్దార్, ఎంపీడీవో, ఎంఇఒ, మడకశిర పట్టణ, గ్రామీణ సిఐలు ముఖ్య అతిథులుగా హాజర వుతారు. నియోజక వర్గ వ్యాప్తంగా డీఎస్సీ(ఎస్జీటీ) పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు సొంత నిధుల తో ఉచితంగా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి రవి కుమార్ తెలిపారు. డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందించి, తద్వారా వారు ఉద్యోగాలు పొంది జీవితాల్లో స్థిరపడి ఈ ప్రాంతానికి మంచి సేవలు అందించాలన్నదే ఎమ్మెల్యే ఉద్దేశం అన్నారు. శిక్షణ తరగతులు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయని, ఇదివరకే పేర్లు నమోదు చేసుకున్న వారు ఇంకా మిగిలిపోయిన అభ్యర్థులు ఉంటే హాజరు కావాలని ఆయన తెలిపారు.

కలెక్టరేట్‌లో నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

పుట్టపర్తి క్రైమ్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తార న్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో 'మీ కోసం' ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గంగమ్మకు జ్యోతులు

గంగమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

గాండ్లపెంట : మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీ పరిధిలోని కత్తివారిపల్లి గ్రామ శివారులో వెలసిన గాండ్లపెంట గంగమ్మకు ఆదివారం గ్రామస్తులు జ్యోతులు, బాణాలు సమర్పించా రు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఏటా ఆషాడ మాసంలో ఆనవాయితీగా గంగమ్మకు జ్యోతులు, బాణాలు సమర్పిస్తామని తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పంట దిగుబడి బాగా రావాలని ఆకాంక్షిస్తూ మహిళలు ఆలయంలో పూజలు నిర్వహించారు.

నిరుపయోగంగా సులభ్ కాంప్లెక్స్

మడకశిర రూరల్ : మడకశిర పట్టణంలోని అమరాపురం బస్టాండ్‌లో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా పడి ఉంది. సులభ్ కాంప్లెక్స్ నిర్వహణకు మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేకంగా వ్యక్తులను నియమించకపోవడంతో అక్కడ అపరిశుభ్రత నెలకొంది. దీంతో ప్రయాణికులు దీనిని ఉపయోగించు కోలేకపోతున్నారు. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సులభ్ కాంప్లెక్స్‌తో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న సులభ్ కాంప్లెక్స్

పేదలకు డిన్నర్ సెట్లు పంపిణీ చేసిన వినాయక సేవా సమితి సభ్యులు

పేదలకు డిన్నర్ సెట్లు పంపిణీ

రొద్దం : మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో 121 మంది పేదలకు డిన్నర్ సెట్లు పంపిణీ చేశారు. గ్రామంలోని చదువుకున్న యువత సేవా భావంతో 'వినాయక సేవా సమితి'ని ఏర్పాటు చేసి కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడే వ్యక్తులు, తల్లిదండ్రులు లేని పిల్లల చదువులకు తమ వంతుగా చేయూతనందిస్తున్నారు. వారి సేవలను గ్రామస్తులు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో వినాయక సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సత్యసాయి భక్తుల పాదయాత్ర

చెన్నేకొత్తపల్లి : పుట్టపర్తి సత్యసాయిబాబా దర్శనం కోసం మహారాష్ట్ర నుంచి 1200 మంది భక్తులు ధర్మవరం రైల్వేస్టేషన్ నుంచి పుట్టపర్తికి పాద యాత్రగా బయల్దేరారు. వారు ఆదివారం కనుముక్కల జడ్పీ హైస్కూల్‌లో కాసేపు సేద తీరారు. వీరు ఏటా ఆషాడ మాసంలో తొలి ఏకాదశి పండగ పర్వదినాన సత్యసాయిబాబా సమాధి దర్శనం కోసం వస్తుంటారని తెలిపారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

చిలమత్తూరు : టిడిపిలో క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని కొత్తచామలపల్లికి చెందిన రామప్పను అధిష్టానం ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తూ, పార్టీ వ్యతిరేక విధానాలను అవలంబించిన కారణంగా సస్పెండ్ చేసినట్లు అందులో పేర్కొన్నారు. ఎంతటి వారైనా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

21న గురుపౌర్ణమి వేడుకలు

మడకశిర : పట్టణంలో వెలసిన సద్గురు శిరిడి సాయిబాబా దేవాలయంలో ఈ నెల 21వ తేదీ నిర్వహించే గురు పౌర్ణమి వేడుకలను పార్టీలకతీతంగా జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఆలయ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలనకి కోరారు. కార్యక్రమంలో పట్టణ ముఖ్య నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

ధర్మవరం టౌన్ : కరాటే విద్య అభ్యసనం ద్వారా ఆత్మరక్షణ ఉంటుందని మల్టీస్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ మాస్టర్ ఇనాయత్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హెచ్‌ఎం మేరీవరకుమారి, జింకా పురుషోత్తం, హిందూపురం, కదిరి సీనియర్ కరాటే మాస్టర్లు శ్రీనివాసులు, అక్బర్‌అలీ పాల్గొన్నారు. కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎల్లో, ఆరంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులను ముఖ్యఅతిథులు ప్రదానం చేశారు.

బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తాం

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

ఎమ్మెల్యే బాలక్రిష్ణకు వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-చిలమత్తూరు

అర్హులందరికీ తప్పకుండా ఇళ్ల పట్టాలు ఇస్తామని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హామీ ఇచ్చారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే సోమగట్టలో వాటర్ ప్లాంట్ పునరుద్ధరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ సయమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, ఇళ్ల స్థలాల సాధన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల పట్టాల సమస్యను వివరించారు. గత ప్రభుత్వం తమను నిర్బంధించి అనేక ఇబ్బందులకు గురి చేయడంతో పాటు అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సైతం అధికారులు బేఖాతరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మీ చేతుల మీదుగా పట్టాలిచ్చి ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పేదలకు అండగా ఉండాలని కోరుతూ వినతి పత్రి ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ మీ ఉద్యమాలను చూశాము.. త్వరలోనే అధికారులతో చర్చించి ఖచ్చితంగా సమస్యను పరిష్కరిస్తామని, అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇళ్ల స్థలాల కమిటీ సభ్యులు, మహిళలు బాలకృష్ణకు పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, రామచంద్ర, లక్ష్మీనారాయణ, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు రహంతుల్లా, నాగరాజు, అశ్వర్థరెడ్డి, యాస్మిన్, రియాజ్, అబ్బాస్, మహబూబ్‌జాన్, నరసింహ, అలివేలమ్మ, రజియాబాను, నాజీరా, బాబాజన్, ఆదిలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలయ్యకు స్వచ్ఛభారత్ కార్మికుల వినతి

జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయి వేతనాలు, కనీస సౌకర్యాలు, తదితర సమ స్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బాలకృష్ణకి గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, వేతనాలు కూడా ఇవ్వలేదని వాపోయారు. అనేక మంది కార్మికులను చట్ట వ్యతిరేకంంగా తొలిగించందన్నారు. స్వచ్ఛ భారత్ కార్మికుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, బాకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో కార్మిక సంఘం నాయకులు పారిశుధ్య, స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సిపిఎస్ ఉద్యోగులను జిపిఎస్‌లోకి చేర్చేలా చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ చేశారు. పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించి గ్యారెంటీ పెన్షన్ స్కీం(జిపిఎస్) పేరిట అమలులోకి తీసుకువచ్చిన జిపిఎస్ విధానాన్ని అమలుపరిచేలా ప్రస్తుత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సిపిఎస్ రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పలు దఫాలుగా పోరాటాలు సాగించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయగలిగిన కూటమి ప్రభుత్వం, జిపిఎస్ చట్టాన్ని ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయని పక్షంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో మళ్లీ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కావున వెంటనే జిపిఎస్‌ను రద్దు చేసి, ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ నాయ కులు రామకృష్ణనాయక్, రాంప్రసాద్, పెద్దకోట్ల సురేష్, సాయి గణేష్, రామాంజనేయులు, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'మాంగల్య'ను ఎత్తేయాల్సిందే

18న భారీ ర్యాలీ, షాపింగ్ మాల్ వద్ద ధర్నా

గిర్రాజు రవి, రామ్‌కుమార్, కోటి వెంకటేష్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో ఏర్పాటు చేసిన మాంగల్య షాపింగ్ మాల్‌ను ఎత్తేసేంత వరకూ పోరాటం ఆగదని, ఈ నెల 18వ తేదీ షాపింగ్ మాల్ వద్ద 2వేల మంది వ్యాపారులతో ధర్నా చేస్తామని ధర్మవరం పట్టుచీరల తయారీ, వ్యాపారుల సంఘం అధ్యక్షులు గిర్రాజు రవి, గౌరవాధ్యక్షులు కలవల రామ్ కుమార్, రెడీమేడ్ అండ్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోటి వెంకటేష్ స్పష్టం చేశారు. పట్టణంలోని శమీ నారాయణస్వామి ఆలయంలో ఆదివారం వారు పట్టణ వ్యాపారులతో సమావేశం నిర్వహించి మాల్ ప్రారంభించడంతో వ్యాపారులకు కలుగుతున్న నష్టాలపై చర్చించారు. వారు మాట్లా డుతూ పట్టణంలో దాదాపు 40 వేల మగ్గాలు ఉన్నాయని, చీరలు నేసినా కూడా అవి విక్రయానికి నోచుకోవడం లేదన్నారు. మాంగల్య షాపింగ్ మాల్ ప్రారంభించడం వల్ల చిన్న, పెద్ద, రెడీమేడ్ వ్యాపారులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి షాపింగ్ మాల్స్ రాకుండా వ్యాపారులంతా ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని కోరారు. అందులో భాగంగా ఈ నెల 18వ తేదీ పట్టణంలోని పుట్లమ్మ గుడి నుంచి దాదాపు 2వేల మంది వ్యాపారులతో భారీ ర్యాలీతా మాంగల్య షాపింగ్ మాల్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు తమ గోడు విన్నవించుకున్నామని, సమస్యలు పరిష్కారమ య్యేలా సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు. మాంగల్య షాపింగ్ మాల్ మూసేంత వరకూ నిరాహార దీక్షలతో పాటు ఆత్మహత్యలకు కూడా వెనుకాడేది లేదన్నారు. రాజకీయ జోక్యం వల్లే పట్టణంలో వ్యాపారులకు తీవ్ర నష్టాలు కలుగుతున్నాయని, కావు పట్టణ వ్యాపారులంతో కలిసికట్టుగా ఉద్యమిస్తేనే పట్టణంలో వ్యాపారాలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో రిటైల్ వ్యాపారుల రంగం రామకృష్ణ, నవీన్, గిర్రాజు శశిధర్, గుండా పుల్లయ్య, నీలూరి శ్రీనివాసులు, గుద్దిటి నాగభూషణం, రెడీమేడ్ అండ్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బిఎం.బాషా, శేషాద్రిరెడ్డి, ఉపాధ్యక్షులు రామచంద్ర, ధనుంజయ, కార్యదర్శి మురళి, కోశాధికారి సుధాకర్, సభ్యులు హరికృష్ణ, సలీం బాషా, అధిక సంఖ్యలో పట్టణ వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు.

మీడియా సహకారం మరువలేనిది : ఎస్పీ

ఎస్పీ మాధవరెడ్డికి సాయిబాబా చిత్రపటం అందజేస్తున్న పాత్రికేయులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మీడియా సహకారం వల్లే జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పామని తద్వారా ప్రభుత్వం నుంచి మంచి గౌరవం దక్కిందని ఎస్పీ మాధవ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సాయి ఆరామంలో ఆది వారం ఏపీయూడ బ్ల్యూజే మీడియా సమావేశానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా ఓ మూల స్తంభమని, ప్రజల సమస్యలపై నిరంతరం నిఘా ఉంచి వాటిని తమ దృష్టికి తేవడమే కాక వాటి పరిష్కారానికి చొరవ చూపుతున్నారన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 15 నెలలు విధులు నిర్వహించగా ఏనాడూ మీడియా ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా మీడియా అధికారాన్ని ఎక్కడా దుర్వినియోగం చేయలేదన్నారు. సమస్య ఉంటే తన దృష్టికి తెచ్చారని, దేనినీ అనవసరంగా నెగిటివ్‌గా కాకుండా మంచి కోణంలో చూపిస్తూ బాగా పని చేశారని కితాబు ఇచ్చారు. ఇంత మంచి మీడియా మిత్రులు ఉండడం వల్లే పోలీసు వ్యవస్థకు మంచి పేరు రావడమే కాక తనకు ఉన్నతాధికారులు, ప్రభుత్వం నుంచి మంచి పేరు వచ్చిందన్నారు. ఎక్కడికి వెళ్లినా ఈ జిల్లా మీడియా మిత్రులను ఎప్పటికీ మరచిపోలేనని ఎస్పీ తెలిపారు. ఇదే సహకారాన్ని వచ్చే అధికారులకు కూడా అందించాలని కోరారు. అనంతరం ఎస్పీని మీడియా మిత్రులు శాలువాతో సత్కరించి శ్రీసత్యసాయి బాబా చిత్రపటం, ప్రసాదం అందజేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల మీడియా మిత్రులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీంస్వామి చిన్నసరిగెత్తు


బత్తలపల్లి పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బత్తలపల్లిలో చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు పానకాలు చదివించగా, ఆదివారం రాత్రి హిందువులు పక్కీరు బాబాలుగా దీక్ష చేపట్టారని ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, నజరుల్లా, కాశింవలి తెలిపారు. శనివారం రాత్రి వర్షం కారణంగా అగ్ని గుండం పెద్దగా వెలగలేదు. సోమవారం ఉదయం గ్రామోత్స వం, అనంతరం పీర్లు గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లి ఆయా గ్రామాల్లో పీర్ల చావిడి వద్ద పూజలందుకుంటాయి. ఈ విధంగా పీర్లు అన్ని గ్రామాలను సందర్శించి అక్కడిపేర్లను జలధి రోజు భేరీలకు బత్తలపల్లికి రమ్మని ఆహ్వానించినట్లుగా అందరూ భావిస్తారు. మొహర్రం వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఆయా గ్రామాల్లో గ్రామ పెద్దలు చర్యలు తీసుకోవాలని ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, ఎస్ఐ శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేశారు.

ధర్మవరం టౌన్ : మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని కొత్తపేట సర్కిల్‌లో చిన్నసరిగెత్తు పూజలు ఘనంగా నిర్వహించారు. పీర్లను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముస్తాబు చేసి పీర్లచావిడిలో కొలువుదీర్చారు. భక్తులు పానకాలు తీసుకొచ్చి పీర్లస్వాములకు సమర్పించారు. అనంతరం అగ్ని గుండం వెలిగించి పీర్లస్వాములకు చక్కెర చదవింపులు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బిల్లే శీనయ్య, మాబు, మహబూబ్‌బాషా, చంద్ర, హుస్సేన్, సుబహాన్ పాల్గొన్నారు.

ఘనంగా కల్పవల్లి 16వ వార్షికోత్సవం

కల్పవల్లి సొసైటీ 16వ వార్షికోత్సవం పాల్గొన్న సభ్యులు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని కోగిర గ్రామ పరిధిలో కల్పవల్లి సంరక్షణ ప్రాంతంలోని బుష్ క్యాంపులో కల్పవల్లి సొసైటీ 16వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టింబక్టివ్ కలెక్టివ్ సొసైటీ వ్యవస్థాపకులు బబ్లు గంగోలి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేరీ వటమట్టం హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్పవల్లి సొసైటీ వార్షిక నివేదిక, సొసైటీ లెక్కచారాలు ఆడిట్ రిపోర్ట్, ఆడిటర్ ఎంపిక, పాలకవర్గ సభ్యుల మార్పులు, చేర్పులు బై లా సవరణలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. సంస్థ డైరెక్టర్లు కార్యక్రమం ఆవశ్యకత, భూమి, నీరు, పర్యావరణ సమతుల్యత, వాతావరణ మార్పులపై సభ్యులకు వివరించారు. కల్పవల్లి సొసైటీ ఉన్న గ్రామాల్లోని యువత బాధ్యత తీసుకొని కల్పవల్లి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం పిల్లలు చేసిన నృత్యాలు, నాటకాలు, చెక్క భజన చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టింబక్టివ్ కల్పవల్లి కలెక్టివ్ మేనేజర్ శ్రీకాంత్, సొసైటీ సీఈవో చిరంజీవి, ఎంటర్‌ప్రైజెస్ మేనేజర్ రమేష్, టింబక్టివ్ కలెక్టివ్ సొసైటీ కోఆర్డినేటర్ కార్యకర్తలు, కల్పవల్లి వాచర్స్, సొసైటీ సభ్యులు, పాల్గొన్నారు.

సత్యసాయి యూనిటీ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌జె.రత్నాకర్, మురళీకార్తీక్

సత్యసాయి యూనిటీకప్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి యూనిటీ కప్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, మాజీ క్రికెటర్ మురళీకార్తీక్, తదితరులు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఏడు దశల్లో జరగనున్న ఈ టోర్నీలో మొదటి రోజు భారత్-11, గ్లోబల్-11 జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన గ్లోబల్-11 జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 96 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన భారత్-11 జట్టు ఒక వికెట్ కోల్పోయి విజయం సాధించింది. విజయం సాధించిన జట్టు సభ్యులను ట్రస్ట్ సభ్యులు అభినందించారు. క్రికెట్ పోటీలు ప్రారంభానికి ముందు సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు చేసిన వివిధ నృత్యాలు చూపరులను అలరించాయి. పోటీలను తిలకించడానికి పుట్టపర్తి, పరిసర ప్రాంతాల నుంచి అభిమానులు తరలివచ్చారు.

కదిరి-బెంగళూరు నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ఆర్టీసీ నూతన బస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ జెండా ఊపి కదిరి-బెంగళూరు నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఛార్జీల రూపంలో ప్రయాణికుల నుంచి దండుకుందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త బస్సులు కొనుగోలు చేసి ప్రయాణికుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. అందులో భాగంగా కదిరి-బెంగళూరు మధ్య నూతన బస్సు సర్వీసును ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించం : ఎమ్మెల్యే

పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఎవరైనా కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెచ్చరించారు. కదిరి సమీపంలోని ముత్యాలచెరువు గ్రామ పొలం సర్వే నెంబర్ 87-2లో 30 సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై ప్రజాశక్తితో పాటు పలు దినపత్రికల్లో ఆదివారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కందికుంట ముత్యాలచెరువు గ్రామ పొలంలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి చేపట్టిన పునాదులు, అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఏ పార్టీకి చెందిన వారైనా కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని, ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని భూములను స్వాధీనం చేసుకుంటా మని స్పష్టం చేశారు.

దళిత మహిళ హత్య కేసును ఛేదించాలి

కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు పెద్దన్న

ప్రజాశక్తి - సోమందేపల్లి

దళిత మహిళను హత్య చేసిన దుండగులను తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపి ఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు పెద్దన్న ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఆదోని మండలంలో దళిత మహిల గుండమ్మను భూ వివాదంలో అదే గ్రామం పెత్తందారులు, భూస్వాములైన రాఘవేంద్రరెడ్డి, శ్రీధర్‌రెడ్డితో పాటు మరో నలుగురు ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించినా పెత్తందారులపై పోలీసు అధికారులు కేసు పెట్టి అరెస్టు చేయక పోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పోలీస్ అధికారులు రాజకీయాలకు తలొగ్గకుండా గుండమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. దళితులపై దాడులను కెవిపిఎస్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్రంలోని దళితులకు అండగా ఉంటామని చెప్పే ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. పెత్తందారులను అరెస్టు చేయాలని లేనిచో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన పోరాటం చేసి గుండమ్మ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకూ అండగా ఉంటామని హెచ్చరించారు.

టిడిపి నేత లక్ష్మిరెడ్డి మృతికి 'గుండుమల' నివాళి

లక్ష్మిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న గుండుమల తిప్పేస్వామి, టిడిపి నాయకులు

మడకశిర రూరల్ : మండలంలోని గుండుమల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అగళి జెడ్పిటిసి ఉమేష్, టిడిపి నాయకులు ఆ గ్రామం వెళ్లి లక్ష్మిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుండుమల మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచి గుండుమల చంద్రప్ప, పాండురంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

18న మండలమీట్

బత్తలపల్లి : ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను వారం ముందుగా అందించాలని, పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. సమావేశానికి అధికారులతో పాటు మండల ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

నేరాలు ఘోరాలు

కారును ఢీకొన్న బైక్.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై ఆదివారం మండలంలోని లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద కారును బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కారు ధర్మవరం నుంచి అనంతపురం వెళ్తుండగా అనంతపురం నగరానికి చెందిన బాషా అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు రాంగ్ రూట్‌లో వస్తూ లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద కారును ఢీకొన్నాడు. గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన బాషాను హుటాహుటిన బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సోమశేఖర్‌మూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అలాగే ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రుని నుంచి వివరాలు సేకరించారు. ప్రథమ చికిత్స అనంతరం బాషాను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాషా పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.